క్లుప్తంగా

బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా అక్రమ్



టేకుమట్ల : మండలంలోని వెలిశాలకు చెందిన ఎండీ అక్రమ్‌ను బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అక్రం మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు.

నియామకం



రాజేంద్రప్రసాద్

పలిమెల : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) మండల ప్రధాన కార్యదర్శిగా చింతల రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యత లేని ఆహారం తినొద్దు



భూపాలపల్లి అర్బన్ : వానాకాలంలో చల్లారిన ఆహారం, బయట దొరికే నాణ్యత లేని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి పద్మ సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు-2లో కార్మికులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. నాణ్యతలేని ఆహార పదార్థాలు ఈగలు వాలిన ఆహారం తింటే వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మేనేజర్ రమాకాంత్, పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



లింగారావు(ఫైల్)

మొగుళ్లపల్లి : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు గండ్ర లింగారావు (90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. లింగారావు స్వాతంత్య్రం కోసం చేసిన కృషిని గ్రామస్తులు స్మరించుకున్నారు.

సన్మానం

ములుగు రూరల్ : ములుగు జిల్లా మెడికల్ కళాశాలకు నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారిని బుధవారం కళాశాల సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన మోహన్‌లాల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో స్వర్ణకుమారి ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు.

మృత్యు మలుపులు

కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- ప్రమాదాల బారిన వాహనదారులు



పంగిడిపల్లి-వెలిశాల మధ్య ప్రమాదకరంగా ఉన్న మలుపు

టేకుమట్ల : గ్రామాల్లోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ రోడ్లపై ఉన్న మూల మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మలుపుల వద్ద వాహనాలు దగ్గరికి వచ్చే వరకు ఎదుటి వాహనాలను గుర్తించలేనంత ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు ఎక్కడా కూడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయక పోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించకుండా గ్రామాల్లోకి రావడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

మండలంలో జరిగిన ప్రమాద సంఘటనలు ఇలా..

మండలంలో లారీ-బైక్ ఢీకొని వెలిశాలకు చెందిన ఒకరు, ఆశిరెడ్డిపల్లి-పంగిడిపల్లి మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి కొందరు గాయపడగా, రామకిష్టాపూర్(వి) గ్రామానికి ఇద్దరు యువకులు, గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పంగిడిపల్లి-వెలిశాల ప్రధాన రోడ్డులో రేణుకా ఎల్లమ్మ గుడి సమీపంలోని మూల మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఇప్పటి వరకు అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అలాగే రాఘవరెడ్డిపేట-ఇప్పలపల్లి గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బస్సు ఢీకొని మృతి చెందాడు. అదే మలుపుల వద్ద పలువురికి తీవ్ర గాయాలు కాగా ప్రాణాలతో బయట పడ్డారు. గర్మిళ్లపల్లి-ఓడేడ్ ప్రధాన రోడ్డు డబుల్ బెడ్రూంల సమీపంలోని మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు.

ప్రమాదంలో కాలు విరిగింది



రెండేళ్ల క్రితం పని మీద హనుమకొండకు వెళ్లి వస్తుండగా పరకాల మండలం నాగారంలో మూల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నా కాలు విరిగింది. పెద్ద ప్రమాదమే జరిగింది. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయట పడ్డా. అప్పటి నుంచి మూల మలుపుల వద్ద చాలా భయంగా అనిపిస్తుంది.

– దూడం భిక్షపతి, టేకుమట్ల

వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి



మూల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించాలి. మలుపుల వద్ద వేగంగా ప్రయాణం చేస్తే అదుపు తప్పి పడిపోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఢీకొనే అవకాశం ఉంటుంది. మూల మలుపుల వద్ద ప్రమాదం తీవ్రస్థాయిలో ఉంటుంది. మలుపుల వద్ద వాహనదారులు జాగ్రత్తగా రావాలి. ప్రమాదాలను నివారించాలి.

– దాసరి సుధాకర్, ఎస్సై, టేకుమట్ల

రాజకీయ లబ్ధికోసమే ఆరోపణలు



మాట్లాడుతున్న ఓంప్రకాష్

రేగొండ : రాజకీయ లబ్ధికోసమే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంటకరమణారెడ్డి అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కొత్తపల్లిగోరి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సూదనబోయిన ఓం ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం రేగొండలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన మండలం కొత్తపల్లిగోరి ఏర్పాటు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.3.20 కోట్లతో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణాలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో చేపట్టారన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ కోసం తాత్కాలిక భవనం ఏర్పాటు చేయగా, శాశ్వత భవన నిర్మాణాలకు వారం రోజుల్లో మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే ధర్నా చేయడం హాస్యాస్పదమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసమే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా, మండల నాయకులు పున్నం రవి, పట్టెం శంకర్, గండు తిరుపతి, వీరబ్రహ్మం, సురేందర్ రెడ్డి, రవీందర్, రమేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ కళ్యాణి చిత్రంలో వ్యవసాయ అధికారులు

టేకుమట్ల : పంట పొలాల్లో నానో యూరియా వాడకంతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కల్యాణి రైతులకు సూచించారు. బుధవారం రైతులకు నానో యూరియా, డీఏపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో యూరియా ద్రవ రూపంలో ఉండి, మొక్కలకు తక్కువ మోతాదులో నత్రజనిని అందిస్తోందన్నారు. నానో యూరియాను ఏదైనా పురుగు మందులలో కలుపుకుని పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. 500 మి.లీ. బాటిల్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు.వ్యవసాయ అధికారులు రాహుల్, అరుణ్, రైతులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ నూతన కమిటీని జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కటకం అశోక్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదార్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా సామబాల నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా బాసాని కృష్ణమూర్తి, కోశాధికారిగా ఆకుతోట రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. మహదేవపూర్, పలిమెల డీలర్లు అందుబాటులో ఉండి రైతులకు నాణ్యమైన సీడ్స్, పర్టిలైజర్స్ సరఫరా చేయాలన్నారు.

హర్షణీయం

కాటారం : కాటారం కేంద్రంగా విద్యుత్ డివిజన్ ఏర్పాటు హర్షణీయమని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కృషితోనే కాటారంలో విద్యుత్ డివిజన్ ఏర్పాటు కానుందని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. విద్యుత్ డివిజన్ ఏర్పాటు శుభపరిణామం అని రైతులకు, వినియోగదారులకు, వ్యాపారస్తులకు విద్యుత్ పరంగా ఏ సమస్య ఎదురైనా త్వరగా పరిష్కారం అయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

కాటారం : మండల విద్యుత్ శాఖ అధికారుల, సిబ్బంది, సబ్ స్టేషన్ల ఫోన్ నంబర్లు మారినట్లు ఏఈఈ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సేవల కోసం అధికారులు, సిబ్బందిని నూతన నంబర్లలో సంప్రదించాలని ఏఈ కోరారు. 8712487050 (ఏఈ), 8712487004 (లైన్ ఇన్‌స్పెక్టర్), 8712487002 (లైన్‌మెన్ కాటారం), 8712487001(లైన్‌మెన్ చింతకాని), 8712487003(లైన్‌మెన్ గంగారం), 8712484326 (కాటారం సబ్‌స్టేషన్), 8712486738 (ధన్వాడ సబ్‌స్టేషన్), 8712487005 (గంగారం సబ్‌స్టేషన్), 8712486737 (దామెరకుంట సబ్‌స్టేషన్) మార్చినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఏటూరునాగారం : తెలంగాణ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో ప్రవేశం పొందాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన గిరిజన బాలికలు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 89784 50045 ఫోన్ చేయాలన్నారు.

భయం.. భయంగా

బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనాలు
- కుక్కలు, కోతుల స్వైరవిహారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పస్రాలో స్వైరవిహారం చేస్తున్న వానరాలు



చల్వాయిలో రోడ్డుపై శునకాల గుంపు

గోవిందరావుపేట : మండలవాసులు రోడ్డెక్కాలంటే భయపడుతున్నారు. కుక్కలు, కోతులు దాడి చేస్తాయని భయపడుతున్నారు. ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలపైకి దూసుకు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా వానరాలు, శునకాల బెడద ఎక్కువైంది. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. ప్రతి రోజు మండలంలో ఎక్కడో ఓ చోట కుక్కలు, కోతులు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులను గాయపరుస్తున్నాయి. పంటలు, పెంకుటిళ్లను నాశనం చేస్తున్నాయి. ఇళ్లలో, దుకాణాల్లో చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. కోతులు, కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు ఇళ్లల్లోకి వచ్చి ఆగం ఆగం చేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కోతులు, కుక్కల బెడద తొలగించి వాటి నుంచి రక్షణ కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.

కిరాణాషాపులు, ఇళ్లలో దాడులు..

వానరాలు తలుపులు, కిటికీల ద్వారా ఇళ్లలోకి చేరి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. తినే పదార్థాలు ఉంటే తీసుకెళ్లడం, దాడికి పాల్పడుతున్నాయి. దేవాలయాల వద్ద కొబ్బరి చిప్పలు, అరటి పండ్ల వంటి వాటి కోసం ఎగబడి భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పండ్ల దుకాణాలపై కోతుల దాడి మరి భయంకరంగా ఉంటుంది. షాపుల యజమానుల బాధ వర్ణాతీతం. కోతులతో విసిగిపోతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఫిర్యాదులు రావడం, వీటికి శాశ్వత చెక్ పెట్టడంలో అధికారులకు సవాల్‌గా మారింది.

రోజుకు పదుల సంఖ్యలో ఆస్పత్రికి..

మండలంలో కోతులు, వీధి కుక్కల సమస్య ఎక్కువవుతుంది. రోజు మండలంలోని గోవిందరావుపేట, పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకి పదుల సంఖ్యలో కోతులు, కుక్కల బారిన పడి వస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారుగా 500 పైగా వీటి బారిన పడి చికిత్స పొందారు.

అన్ని సీజన్లలోనూ..

కుక్కలు, కోతుల దాడుల్లో రోజు మండలంలో ఎక్కడో ఓ చోట ప్రజలు గాయపడుతూనే ఉన్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 5వేలకు పైగా వీధికుక్కలు ఉంటాయని సమాచారం. ఇక కోతుల సంఖ్య సుమారు లక్షకి పైనే ఉంటుంది.

అధికారులు స్పందించాలి



పస్రాలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో ఇక్కడి కిరాణా షాపులు, పండ్ల దుకాణాలు, హోటళ్లలో కోతులను తరిమేందుకు ఒక మనిషి ప్రత్యేకంగా ఉండాల్సి వస్తుంది. ఒక్క నిమిషం ఆదా మరిస్తే చాలు వాటి చేతికి దొరికిన తీసుకెళ్తాయి. ఇప్పటికి ఎన్నో సార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలి.

– బొమ్మగాని నరేందర్, వ్యాపార సంఘం అధ్యక్షుడు, పస్రా

ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీ



మంగపేట : మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ భద్రు బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో వంటగది, పరిసరాలు, విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనిఖీ సమయంలో వార్డెన్లు అందుబాటులో లేరని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నిబంధనలు పాటించడం లేదని భోజనం పరిశీలించగా ఏమాత్రం బాగాలేదని అన్నారు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లో నాలుగు రోజుల అటెండెన్స్ వేయలేదని గుర్తించామన్నారు. ఆయా హాస్టళ్ల పరిశీలనలో వెల్లడైన వాస్తవ పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై హేమ

చిట్యాల : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై హేమ తెలిపారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (డ్రగ్స్ నార్కోటిక్) మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలో బాగా చదువుకోవాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని అన్నారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, చంద్రమౌళి, కళాశాల సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు.

సివిల్ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

- సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేష్

చిట్యాల : మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. గతంలో ఆస్పత్రిలో అనేక ప్రసవాలు అయ్యేవని తెలిపారు. కానీ పది నెలల నుంచి ఎలాంటి ప్రసవాలు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పోతుందని విమర్శించారు. 18మంది డాక్టర్లు ఉండాల్సిన ఆస్పత్రిలో ఆరుగురే ఉన్నారని చెప్పారు. గర్భిణులకు అత్యవసర సమయంలో పట్టణాలకు పోవాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆస్పత్రిని మరోసారి సందర్శించి పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని కోరారు. లేనిచో సివిల్ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కాటారం : తమతో పని చేసిన మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీపీ)కి చెందిన గుండు శేఖర్ భూపాలపల్లి సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో క్లర్క్‌గా పని చేసేవాడు. ఇటీవల భూపాలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అందరూ విరాళాలు వేసుకొని రూ.56,500 జమ చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన శేఖర్ దశదిన కర్మకు హాజరైన కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్, ప్రిన్సిపాల్ ఎలగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో నగదును శేఖర్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మొగిలి, రమేశ్, నరేందర్, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్, ఆనంద్, రాజు, సురేశ్, రంజిత్, బిక్షపతి, సతీశ్, సురేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే



జీపీ వద్ద పరిశీలిస్తున్న కోఆర్డినేటర్లు

కాటారం: కాటారం, మహాముత్తారం మండలాల్లో బుధవారం అకడమిక్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్బీఎం కోఆర్డినేటర్లు వెంకటేశ్, భాస్కర్ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా చెత్త సేకరణ, తరలింపు, ప్రభుత్వ సంస్థల సహకారం తదితర అంశాలపై ఎస్బీఎం కోఆర్డినేటర్లు ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. పలు గ్రామాల్లో పర్యటించి వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, ఇంటింటా మరుగుదొడ్డి, తాగునీటి సరఫరా అంశాలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు కోఆర్డినేటర్లు తెలిపారు. వారి వెంట ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

‘ఇందిరమ్మ’ పేరిట ఇసుక దందా



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్, చిత్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్

టేకుమట్ల : చలివాగు, మానేరు నుంచి లారీల్లో, ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ పేర్కొన్నారు. అక్రమంగా దందాలు, ధర్నాలు ఎవరు చేస్తున్నారో మండలవాసులు గమనిస్తున్నారని అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల అనుమతుల పేరుతో ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించారో.. ఇప్పటి వరకు ఎన్ని అక్రమ దందాలు కొనసాగిస్తూ ఇసుకను తరలించారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్థాయిని మరిచి మాట్లాడితే సరైంది కాదని తెలిపారు.చిన్న గ్రామంగా ఉన్న భూపాలపల్లి నేడు జిల్లా కేంద్రంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీది అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బందెల నరేష్, నల్లబెల్లి రవీందర్, మారం లింగారెడ్డి, రేణుకుంట్ల సమ్మయ్య, వసంతరావు, వరదచారి, లక్ష్మణ్, నర్సింగరావు, మొండయ్య, కుమారస్వామి, రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాల జారీలో కాలయాపన



సమావేశంలో మాట్లాడుతున్న రవివర్మ

మంగపేట : తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడెబోయిన రవివర్మ ఆరోపించారు. మండలంలోని కోమటిపల్లిలో ఆ సంఘం అత్యవసర సమావేశం మండల అధ్యక్షుడు జోగ బాలయోగి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రవివర్మ హాజరై మాట్లాడుతూ..రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ గిరిజనులకు(ఎస్టీ) కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసేందుకు కుల సంఘాల వెరిఫికేషన్ ప్రక్రియ అంటూ కాలయాపన చేస్తు సకాలంలో పత్రాలు జారీ చేయడం లేదని విమర్శించారు. దీంతో అవసరమైన సమయంలో కుల సర్టిఫికెట్లు అందక విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరగాల్సి వస్తోందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు విచారణ చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆ పనిని బయటి వ్యక్తులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు చెప్పినా సమస్య పరిస్కారం కావడం లేదన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుని విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించే విధంగా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి పొదెం భార్గవ్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి ఆగబోయిన చంద్రకాంత్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, జబ్బ ప్రణీష్, కుడుముల సాయి తదితరులు పాల్గొన్నారు.